పది పరీక్షలు షురూ

● నియోజకవర్గంలో 55 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
● మొదటి రోజు 68 మంది విద్యార్థుల గైర్హాజరు


పరీక్ష కేంద్రానికి గంట ముందే హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు


పరీక్ష కేంద్రంలోకి వెళ్లేందుకు క్యూ కట్టిన విద్యార్థులు


హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న దృశ్యం


పరీక్ష బాగా రాయాలని కుమారుడికి ఆల్ ది బెస్ట్ చెబుతున్న తండ్రి

పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అధికారులు ఐదు నిమిషాలు ఆలస్యం అయితే కేంద్రానికి అనుమతి లేదని ముందస్తుగానే చెప్పడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 12,784 మంది విద్యార్థులు ఉండగా 55 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు 68 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులతో పాటు వచ్చిన వారి తల్లిదండ్రులు పరీక్ష రాసేంతవరకు చెట్ల కింద, దుకాణాల వద్ద సేదతీరుతూ కనిపించారు. – సుభాష్‌నగర్


విద్యార్థులు పరీక్ష కేంద్రంలోకి వెళ్లేదాకా తల్లిదండ్రుల చూపు


విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది


పిల్లలకు బాయ్ చెబుతున్న ఓ తండ్రి


పరీక్ష బాగా రాయాలని విజయ సంకేతం చూపిస్తున్న పేరెంట్స్

దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్


మల్లికార్జునస్వామి జాతరలో పాల్గొన్న వివేకానంద్

కుత్బుల్లాపూర్: దేవాలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని... కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీనివాసుడి కరుణా కటాక్షాలతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, సుధాకర్ గౌడ్, గుమ్మడి మధుసూదన్ రాజు, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, మహిళా నాయకురాలు శ్రీదేవి రెడ్డి, సత్యనారాయణ, మాధవ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఎస్.తిరుమల రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.మాధవరెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్. వెంకటేశం, కోశాధికారి కే.రామాచారి తదితరులు పాల్గొన్నారు.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే..
కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లి గ్రామంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతరకు ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, స్థానిక కౌన్సిలర్లు కిరణ్, రవీందర్, శివ కుమార్, చింతల లక్ష్మీ దేవేందర్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యులు వెంకటేష్, పాక్స్ డైరెక్టర్లు బూర్గుబావి సత్యనారాయణ, కృష్ణ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మధుసూదన్ యాదవ్, పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


వేంకటేశ్వస్వామి దేవాలయంలో హారతి తీసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

'పెంచల్‌రెడ్డి పేదల అభ్యున్నతికి ఎంతో చేశారు'


పెంచల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన దృశ్యం

చింతల్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో సోమవారం కాలనీ వ్యవస్థాపకుడు పెంచల్‌రెడ్డి 27వ వర్ధంతిని నిర్వహించారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెంచల్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివంగత పెంచల్‌రెడ్డి కాలనీ స్థాపనతో పాటు పేదల అభ్యున్నతికి కృషి చేశారని వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెంచల్‌రెడ్డి కుమారుడు జనార్దన్‌రెడ్డి, నిషాని చందర్, డేగల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ డ్రైయిన్ల నిర్మాణం చేపడతాం

సుభాష్‌నగర్: ప్రతి వర్షాకాలంలో తలెత్తే వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా కృషి చేస్తున్నామని గాజులరామారం కార్పొరేటర్ రావుల శేషగిరి అన్నారు. సోమవారం సర్కిల్ డీఈ రూపాదేవితో కలిసి గాజులరామారం డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వరదనీటి ముంపు సమస్య నెలకొన్న ప్రాంతాల్లో ఓపెన్ డ్రైయిన్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.


డీఈ రూపాదేవితో ఓపెన్ డ్రైయిన్ల నిర్మాణంపై చర్చిస్తున్న కార్పొరేటర్

పార్కు స్థలమంటూ కబ్జా!

నిజాంపేట్: పార్కు కాని స్థలాన్ని పార్కు స్థలం అంటూ కబ్జాకు పాల్పడి కొందరు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని బిల్డర్ విజయలక్ష్మి అన్నారు. బాచుపల్లిలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మల్లంపేట్‌లోని సర్వే నంబర్ 170/3,170/4,170/5లలో 15 ఎకరాల భూమిలో లక్ష్మి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ పేరుతో కొనుగోలు చేసి 2021 నాటికి గ్రామ పంచాయతీ, హెచ్ఎండీఏ అనుమతులు తీసుకుని వెంచర్‌ను పూర్తి చేశామన్నారు. ఈ వెంచర్‌లోనే 1200 గజాల స్థలాన్ని సౌభాగ్యకు విక్రయించామన్నారు. స్థలాన్ని కొనుగోలు చేసిన వారు స్థానికంగా లేకపోవడంతో ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు శ్రీకృష్ణ అనే వ్యక్తితో పాటు మరి కొందరు వ్యక్తులు స్థానికంగా ఓ రాజకీయ నాయకుడిని అండదండలతో పార్కుగా తయారు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు.
– ఈ విషయంపై స్థలం కొనుగోలు చేసిన వారు కోర్టును ఆశ్రయించగా కోర్టు ఇన్‌జెక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ వెంచర్‌లో పార్కు స్థలం వేరే దగ్గర కేటాయించామన్నారు. విల్లాలు కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు పూర్తి డబ్బులు చెల్లించకుండా బకాయి ఉన్నవారు బీఆర్ఎస్ నాయకుడు అంజనేయులు అండతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఓ విల్లా తమకు ఇస్తే మీకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని తమను బ్లాక్ మెయిల్ సైతం చేస్తున్నారని అందుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆమె తెలిపారు. తమకు పూర్తి డబ్బులు చెల్లించిన వారికి అన్ని సౌకర్యాలు కల్పించమని పేర్కొన్నారు. తమకు బాకీ ఉన్నవారు మాత్రమే లేనిపోని ఆరోపణలు చేస్తూ ఇవ్వాల్సిన డబ్బులు ఎక్కడ ఇవ్వాల్సి వస్తుందోనని లేనిపోని కుట్రలు చేస్తున్నారని విజయలక్ష్మి ఆరోపించారు.


సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

విధులు సున్న.. నిధులు స్వాహా

● సిల్ట్ వాహనాల పేరిట అక్రమార్జన ● డ్రైనేజీ వ్యర్థాలు తరలింపు అంతంతే.. ● మొత్తం తరలిస్తున్న బిల్లులు తీసుకుంటున్న వైనం


గణేష్‌నగర్‌లోని ఓ వీధిలో వ్యర్థాలను తరలించకుండా వదిలేయడంతో అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం


కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో నిలిపిన సిల్ట్ తరలింపు వాహనాలు

రంగారెడ్డినగర్: డ్రైనేజీ నుంచి సిల్ట్ తొలగించేందుకు జలమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రైవేట్ సిల్ట్ వాహనాల పేరిట నిధుల స్వాహా కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని డివిజన్‌కు ఒకటి చొప్పున సిల్ట్ వాహనం తిరుగుతున్నట్లు రికార్డుల్లో చూపెతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉంటున్నాయి. ఏ డివిజన్‌లో చూసినా డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలు రోజుల తరబడి తరలించకుండా మ్యాన్‌హోళ్లనే కనబడుటంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.
◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల పరిధిలోని 8 డివిజన్లకు గాను జలమండలి ఆధ్వర్యంలో 8 మంది లబ్ధిదారులకు దళితబంధు పథకం కింద సిల్ట్ వాహనాలను అందజేశారు. అయితే సదరు వాహనాలు అసలైన లబ్ధిదారులకు కాకుండా ప్రజాప్రతినిధులు కొందరు తమకు నచ్చిన వారికి అప్పగించారన్న ఆరోపణలు అప్పట్లో వినిపించాయి. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులే సదరు వాహనాలకు బినామీలుగా ఉన్నట్లు కోడై కూస్తోంది.
◆ దీంతో డ్రైనేజీ నుంచి తీసిన సిల్ట్‌ను తరలించక పోయినా అధికారులు పట్టించుకోవడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి.. కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ డివిజన్ పరిధిలో మొత్తం 8 వాహనాలకు గాను నెలకు రూ.17.28 లక్షల నిధులను బిల్లుల రూపంలో ఇస్తున్నా సిల్ట్ తరలింపులో మాత్రం జాప్యం కనబడుతూనే ఉంది.

అక్రమార్జన ఇలా..
◆ సిల్ట్ వాహనం ప్రతిరోజు తమకు కేటాయించిన డివిజన్‌లో నిర్ణీత మొత్తంలో సిల్ట్‌ను తరలించాల్సి ఉంటుంది. కాని పలు డివిజన్లలో వారానికి కూడా డ్రైనేజీ నుంచి వ్యర్థాలను తీయడం లేదు. దీంతో రికార్డుల్లో మాత్రం రోజు సదరు వాహనం సిల్ట్ తరలిస్తున్నట్లుగా చూపుతున్నారు. సిల్ట్ తరలించకున్నా బిల్లులు మాత్రం చెలిస్తున్న అధికారులు ఒక్కో వాహనదారుడి నుంచి ప్రతి నెలా రూ.5 వేల నుంచి రూ.10వేల వరకు కమిషన్‌గా తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం.
◆ జలమండలి పరిధిలో ఏదైనా ప్రైవేట్ వాహనాన్ని నడిపితే దానికి అద్దె మాత్రమే చెల్లిస్తారు. కాని సిల్ట్ వాహనానికి అద్దె, డ్రైవర్ జీతం, ఇద్దరు కార్మికుల జీతాలు, డీజిల్ ఖర్చులను జలమండలే భరిస్తోంది. ఇలా ఒక్కో వాహనానికి నెలకు 1.20 లక్షలు బిల్లులు రూపంలో చెల్లిస్తుండటం గమనార్హం.
◆ అయితే చాలా వరకు సిల్ట్ వాహనాలకు ఒక డ్రైవర్, ఒక సహాయకుడిని మాత్రమే నియమిస్తూ సదరు యజమానాలు జలమండలి నిధులను స్వాహా చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.
◆ సిల్ట్ తరలింపులో పాల్గొనే కార్మికులకు బూట్లు, యూనిఫామ్,హెల్మెట్, గ్లౌజెస్‌లతో పాటు రూ.3వేల విలువైన భద్రతా పరికరాలను జలమండలి సరఫరా చేస్తోంది. అయితే ఎక్కడా సిల్ట్ తరలించే క్రమంలో వాటిని ఉపయోగిస్తున్న దాఖలాలు కనబడటం లేదు.


చింతల్ మార్కెట్ రోడ్డులో డ్రైనేజీ వ్యర్థాలను మ్యాన్‌హోళ్ల వద్దనే వదిలేసిన దృశ్యం

ఒక్కో సిల్ట్ వాహనానికి నెలవారీ ఖర్చులు ఇలా..
◆ వాహనం అద్దెకు రూ. 23,150, డ్రైవర్ జీతం రూ.27,090, ఇద్దరు సహాయకులకు రూ.43,680, రోజుకు 8 లీటర్ల చొప్పున నెలకు డీజిల్ ఖర్చు రూ. 21,840, లూబ్రికెంట్లు రూ.1,000, భీమాకు రూ.2,500, ఇతర అలవెన్సులు రూ.740 మొత్తం 1.20 లక్షలు ఇస్తున్నారు.

ప్రొఫెసర్ డీబీ రామాచారికి అరుదైన అవకాశం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డీబీ రామాచారి కి అరుదైన గౌరవం దక్కింది. టెట్రాహెడ్రాన్ అండ్ టెట్రాహెడ్రాన్ లెటర్స్ ఎడిటోరియల్ బోర్డులో చేరేందుకు అవకాశం కల్పించారు. ఆయన హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీలోని క్యాటలిసిస్ లేబొరేటరీలో ప్రొఫెసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ప్రతిష్టాత్మక ఆర్గానిక్ కెమిస్ట్రీ జర్నల్స్ అనేవి ఆర్గానిక్ కెమిస్ట్రీ రంగంలో విభాగాలు, ప్రపంచవ్యాప్తంగా పూర్తి అసలైన పరిశోధనా పత్రాలను వేగంగా ప్రచురించడానికి అంతర్జాతీయ జర్నల్‌లుగా 1959 నుంచి గుర్తింపు పొందాయి. కాగా ప్రొఫెసర్ రామాచారి 115 కంటే ఎక్కువ ప్రచురణలను కలిగి ఉండడం విశేషం. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బెంగళూరులోని ఫెలో వంటి ఇతర అవార్డులు, గుర్తింపు కూడా పొందారు.ఆయన అనేక అవార్డులతో పాటు 2014లో హెచ్‌సీయూ చాన్స్‌లర్స్ అవార్డును కూడా సాధించారు. 22 మంది పీహెచ్‌డీలకు మార్గనిర్దేశం చేయడం విశేషం. ఆయనను పలువురు ప్రొఫెసర్లు అభినందించారు.

మురుగు పరుగు

జగద్గిరగుట్ట: డివిజన్ పరిధిలోని మగ్దూంనగర్, నాగార్జున స్కూల్ సమీపంలోని రోడ్డులో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. వారం రోజులుగా ఎవరు పట్టించుకోవడం లేదని, మురుగు వాసనతో వీధిలో తిరగలేకపోతున్నమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు ప్రబలకముందే ఈ డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.



పార్కుల్లో ఆర్‌డబ్ల్యూహెచ్‌ల ఏర్పాటుపై సమీక్ష


రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు కల్పనతో సమావేశమైన అధికారులు, కార్పొరేటర్లు

నిజాంపేట్: పార్కుల్లో వర్షపునీటిని ఒడిసి పట్టేలా ఆర్‌డబ్ల్యూహెచ్‌ల ఏర్పాటు చేసే విషయమై సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులతో రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ వ్యవస్థాపకురాలు కల్పన రమేష్ సమావేశమయ్యారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి వర్షాకాలంలో వరదలను నివారించి ఆర్‌హెచ్‌ఓల ద్వారా నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం ఈ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశమని కల్పన పేర్కొన్నారు. దీంతో నిజాంపేట్, ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం పెరిగి నీటి ఎద్దడి సమస్య తొలగనుందన్నారు. ఈ సమావేశంలో ఏయే పార్కుల్లో ఆర్‌డబ్ల్యూహెచ్‌లను ఏర్పాటు చేయాలన్న దానిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, 11వ డివిజన్ కార్పొరేటర్ రవికిరణ్, జలమండలి, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

లిఫ్ట్ వైర్లు తెగిపోవడంతో కిందపడి కార్మికుడి మృతి

సుభాష్‌నగర్: తాత్కాలిక లిఫ్ట్ వైర్లు తెగిపోవడంతో ఓ భవన నిర్మాణ కార్మికుడు తొమ్మిది అంతస్తులపై నుంచి కిందకు పడి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణసింగ్ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం బీబీపేటకు చెందిన గుర్రాల సత్యనారాయణ (45), లక్ష్మి దంపతులు బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి సూరారం రాజీవ్‌గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి కూతురు రేఖ (25), కొడుకు రాజు (23) పిల్లలున్నారు. కాగా సత్యనారాయణ మెట్‌కానిగుడలోని మోడీ బిల్డర్స్‌లో భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే పనికి వెళ్లిన అతను సోమవారం సాయంత్రం సమయంలో బిల్డింగ్ బయట నుంచి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన లిఫ్ట్ నుంచి సరుకులను దింపుతున్న క్రమంలో సత్యనారాయణ తొమ్మిదంతస్తుల పై నుంచి పడి అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నారాయణ సింగ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహానికి శవ పంచనామా నిర్వహించారు. కాగా లిఫ్ట్ తెగి పడిన సమయంలో కింద పని చేస్తున్న కార్మికులు తృటిలో ప్రమాదం నుండి తప్పించుకున్నారు. మృతుని కుమార్తె రేఖ వివాహం ఏప్రిల్ నెలలో జరగ్సాలి ఉంది. ఇంటి పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. బిల్డర్ నిర్లక్ష్యం కారణంగానే సత్యనారాయణ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


భవనంపై నుంచి పడి మృతి చెందిన సత్యనారాయణ

22న ప్రతిష్ఠాపన మహోత్సవం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ రాఘవేంద్ర కాలనీలోని శ్రీహరిహర క్షేత్రము ఆయ్యప్ప ఆలయంలో ఈనెల 22న పంచలోహ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఉదయం 9.40 గంటల నుండి 11.30గంటల వరకు జరిగే పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

రెవెన్యూ సీజీఎం శ్రీధర్‌రెడ్డికి శుభాకాంక్షలు


శ్రీధర్‌రెడ్డిని సన్మానించిన జలమండలి అధికారులు, సిబ్బంది

చింతల్: కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఎం. శ్రీధర్‌రెడ్డి రెవెన్యూ సీజీఎంగా పదోన్నతి పొందారు. సోమవారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డిని డీజీఎంలు రాజేష్, విష్ణు ప్రసాద్, అప్పలనాయుడు, రాజుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆఫీసర్ విజయ కుమారి, రెవెన్యూ ఆఫీసర్ రామచందర్, సూపరింటెండెంట్ రాములు, సెక్షన్ల మేనేజర్లు శివప్రసాద్, రోహిణి, అంకిత్, ర్యూన్సీ, పూజిత, అనూష,రమ్య భారతి , కాంట్రాక్టర్లు ఆర్ శ్రీనివాస్, సూర్య ప్రకాశ్ రెడ్డి కోటేశ్వరరావు, మతిన్ వాహబ్, కదారి స్వామి తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సుభాష్‌నగర్: తాగిన మత్తులో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ఓం జెండా ప్రాంతానికి చెందిన మల్లేశ్(44), మణెమ్మలు భార్యాభర్తలు. కాగా సోమవారం ఉదయం 10 గంటల సమయంలో మల్లారెడ్డి ఆస్పత్రిలో మెడికల్ చెకప్ కోసం మణెమ్మ తన సోదరి శ్రావణితో కలిసి వెళ్లింది. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న మల్లేశ్‌ను రావాలని కోరగా రానని చెప్పాడు. మెడికల్ చెకప్ పూర్తయిన తరువాత ఇంటికి వచ్చి చూడగా మల్లేశ్ సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. దీంతో చుట్టు పక్కల వారి సహాయంతో అతన్ని కిందకు దింపి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు మల్లేశ్

కుళ్లిపోయిన స్థితిలో బాలుడి మృతదేహం లభ్యం

సుభాష్‌నగర్: కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఓ బాలుడి మృతదేహం లభ్యమైన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం... సూరారం శ్రీకృష్ణనగర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో కుళ్లిపాయిన స్థితిలో మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సోమవారం రాత్రి 9 గంటలకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అటవీ ప్రాంతంలో చెట్లపొదల్లో మగ శవం కుళ్లిన స్థితిలో గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. ఈ మేరకు పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం హత్య, ఆత్మహత్య అనేది తెలుస్తుందని తెలిపారు.

సెక్యూరిటీ గార్డు అదృశ్యం

నిజాంపేట్: సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న వ్యక్తి అనుమానాస్పద స్థితిలో అదృశ్యమైన ఘటనలో బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లికి చెందిన వీరేశం కుమారుడు కమ్మరి ప్రశాంత్(28) ఏసీకే ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌లో సెక్యూరిటీ పని చేస్తున్నాడు. కాగా అదే కంపెనీలో పని చేస్తున్న అశోక అనే వ్యకిత ఫిబ్రవరి 10వ తేదీన ప్రశాంత్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రాళ్లగడ్డలోని బెంట్లీ సర్వీసెస్ సెంటర్‌లో సీసీ కెమెరాలను ప్రశాంత్ ధ్వంసం చేశాడని, దీంతో అతని మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రశాంత్ కుటుంబ సభ్యులు కంపెనీ వద్దకు వెళ్లి చూడగా అతను కనిపించకుండా పోయాడని తెలిపారు. ఆందోళన చెందిన కటుంబ సభ్యులు పలు ప్రదేశాల్లో వెతికినా అతని ఆచూకీ తెలియరాలేదు. కంపెనీ యాజమాన్యంపై అనుమానం ఉందని పేర్కొంటూ బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రశాంత్ (ఫైల్)

పేకాటరాయుళ్ల అరెస్ట్

నిజాంపేట్: పేకాడుతున్న పలువురిని బాచుపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట్‌లోని జెఎస్ఎస్ రెసిడెన్సీ సెల్లార్‌లో పేకాడుతున్నట్లు సోమవారం రాత్రి సమాచారం అందింది. దీంతో బాచుపల్లి పోలీసులు శిబిరంపై దాడి చేసి పేకాడుతున్న కార్పొరేటర్ సురేశ్‌రెడ్డి, వెంగయ్య చౌదరి, కొలను భద్రరెడ్డి, రాజమోహన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డిని పట్టుకున్నారు. వీరి నుంచి రూ.41 వేలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.